చాకలి ఐలమ్మ.. నేటి తరానికి ఆదర్శం

ప్రతి ఒక్కరూ వీరనారి చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. పలు ప్రాంతాల్లో ఐలమ్మ విగ్రహాలు, చిత్రపటాలకు పెద్దఎత్తున నివాళులర్పించారు. సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ నేటితరానికి ఆదర్శమని అన్నారు.


హబ్సిగూడలో చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి


పీర్జాదిగూడలో నివాళులర్పిస్తున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి


రామంతాపూర్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ శ్రీవాణి వెంకట్‌రావు


రామంతాపూర్ సత్యనారాయణ స్వామి దేవాలయం వద్ద..


ఇందిరానగర్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సబితకిషోర్


ఇందిరానెహ్రూనగర్‌లో నివాళులర్పిస్తున్న రజక సంఘం నేతలు


చిలుకానగర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు


నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి


ఉప్పల్ చౌరస్తాలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో బీఆర్ఎస్ నేతలు, అధికారులు


ఈసీఐఎల్ చౌరస్తాలో ఐలమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషారెడ్డి

కారు దిగకుండా..

కేడర్‌ను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ పక్కా స్కెచ్

- ఆపరేషన్ మల్కాజిగిరిలో భాగంగా..
- కార్పొరేటర్ల కట్టడి, అధికారుల బదిలీలు
- ఉద్యమకారులకు బుజ్జగింపులతో బిజీగా..



అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ వేగంగా పావులు కదుపుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పార్టీని వీడటంతో పాటు బీఆర్ఎస్ ఓటమికి పనిచేస్తానని సవాల్ విసరడంతో మల్కాజిగిరిలో తిరిగి బీఆర్ఎస్ స్థానాన్ని నిలబెట్టుకోవడం కోసం సర్వశక్తులు ఒడ్డుతోంది. ఆపరేషన్ మైనంపల్లి అంటూ మైనంపల్లి సానుభూతిపరులపై దృష్టి సారించింది. పార్టీ శ్రేణులు మైనంపల్లి వెంట వెళ్లకుండా చర్యలు తీసుకుంటోంది. మంత్రి మల్లారెడ్డి అల్లుడు, మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాజశేఖర్‌రెడ్డిని మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దించారు. దీంతో ఆయన 10 రోజులుగా నియోజకవర్గంలోని పలువురు నాయకులను ఉదయం పూట కలవడంతో పాటు సాయంత్రం వినాయక మండపాలను సందర్శిస్తూ స్థానికులను కలుస్తున్నారు.

కార్పొరేటర్ల కట్టడి

నియోజకవర్గంలో 9 డివిజన్లు ఉండగా వాటిలో మూడు డివిజన్లలో బీజేపీ కార్పొరేటర్లు, ఆరుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఉన్నారు. వీరిలో ఇద్దరు మైనంపల్లికి అత్యంత సన్నిహితులు కావడంతో వారు మైనంపల్లి వెంట వెళ్తున్నారు. మిగిలిన నలుగురిని పార్టీ మారకుండా కట్టడి చేయనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు, ద్వితీయశ్రేణి నాయకులు సైతం మైనంపల్లి వెంట వెళ్లకుండా పక్కా స్కెచ్ వేస్తున్నారు. ఉద్యమ నాయకులను కలుస్తూ పార్టీలో వారికి భవిష్యత్ ఉంటుందని భరోసా కల్పిస్తున్నారు.

అధికారుల బదిలీలు

నియోజకవర్గంలో పలు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులను బదిలీ చేస్తున్నారు. ఇటీవలే నేరేడ్‌మెట్, అల్వాల్ సీఐలతో పాటు మల్కాజిగిరి, కుషాయిగూడ ఏసీపీలు బదిలీ కాగా మంగళవారం మల్కాజిగిరి సీఐ కూడా బదిలీ అయ్యారు. త్వరలో ఇతర విభాగాల్లో సైతం మార్పులు ఉంటాయని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే మైనంపల్లికి సహకరించే అధికారులు కీలక బాధ్యతల్లో ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

నేడు మల్కాజిగిరిలో ర్యాలీ

పార్టీ శ్రేణులను ఒకే వేదికపై తీసుకురావడంతో పాటు ఇతర పార్టీ నాయకులను సైతం బీఆర్ఎస్‌లో చేరేలా ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రి మల్లారెడ్డి ఈ సమావేశానికి హాజరై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నట్లు తెలిసింది.

ఘనంగా నాస్వి సిల్వర్ జూబ్లీ వేడుకలు



మల్కాజిగిరి: నాస్వి(నేషనల్ అసోషియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా) 25వ వార్షికోత్సవం మల్కాజిగిరి వెండర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. నాయకులు షేక్‌బాజిబాష, యాదగిరి, శ్రీనివాస్, లక్ష్మయ్య, హన్మంతు, వెంకటేష్, సువర్ణ, ఎల్లమ్మ, రాజు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో పరిస్థితులపై హోంమంత్రి ఆరా

అల్వాల్: తెలంగాణ ఉద్యమకారుడు గొట్టిముక్కల శ్రీనివాస్‌గౌడ్, జ్యోతిగౌడ్ నివాసానికి మంగళవారం రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ వచ్చారు. మల్కాజిగిరి నియోజకవర్గం పరిస్థితులపై ఆరా తీశారు. 14 ఏళ్ల ఉద్యమ అనుబంధంతో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఇందులో వేరే ఉద్దేశం ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు. అధిష్టానం ఎమ్మెల్యే టికెట్ ఎవరికీ కేటాయించినా కలిసి పనిచేయాలని, అభ్యర్థిని గెలుపించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకట్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ నాగేశ్వరరావు, అల్వాల్ సీఐ ఆనంద్‌కిషోర్, నాయకులు ఆనంద్, సంపత్, బసవరాజు తదితరులు ఉన్నారు.


అల్వాల్‌లోని గొట్టిముక్కల శ్రీనివాస్‌గౌడ్ నివాసంలో హోంమంత్రి మహమూద్ అలీ

నందికంటి శ్రీధర్‌కే టికెట్ ఇవ్వాలి

మల్కాజిగిరి: మల్కాజిగిరి అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా నందికంటి శ్రీధర్‌నే ప్రకటించాలని పార్టీ నాయకులు అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పీజేఆర్ అనుచరుడిగా సుదీర్ఘకాలం పార్టీకి సేవలందిస్తున్న విషయాన్ని అధిష్టానం గుర్తించాలన్నారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత తొలిసారి టికెట్టు కేటాయించారన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటికీ వీడకుండా డీసీసీ అధ్యక్షుడిగా సేవలందించిన నందికంటి శ్రీధర్‌కే టికెట్టు కేటాయిస్తే మల్కాజిగిరిలో విజయం సాధించడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తామన్నారు. సమావేశంలో వెంకటేష్‌యాదవ్, గుత్తి రాంచందర్, శ్రీనివాస్‌గౌడ్, సానాది శంకర్, వినోద్‌యాదవ్, అలీ, నర్సింగరావు, ఉమేష్‌సింగ్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి



గౌతంనగర్: డివిజన్ పరిధిలోని మిర్జాల్‌గూడలో కొనసాగుతున్న ఆర్‌సీసీ పైప్‌లైన్ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పైపులైన్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మేకల రాముయాదవ్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకానగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌ను గ్రేటర్‌లోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం చిలుకానగర్ బ్యాంక్ కాలనీ సీఆర్ఎంపీ నిధులతో వేస్తున్న సీసీ రోడ్డు పనులను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. డివిజన్ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈఈ నాగేందర్, డీఈ నిఖిల్‌రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు ఏదుల కొండల్‌రెడ్డి, జగన్, బాలు, శ్యామ్ పాల్గొన్నారు.

చదువుతో పాటు ఉపాధి


కళాశాల నిర్వాహకులు డా. నారాయణ

అల్వాల్: ఫీజులు చెల్లించి చదువుకోలేని వారి కోసం నారాయణ హోటల్ మేనేజ్‌మెంట్ నూతనంగా కోర్సును ప్రారంభించిందని కళాశాల నిర్వాహకులు డాక్టర్ నారాయణ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ చదువుతోపాటు సంపాదన అవకాశాలను కల్పించడానికి ఏర్న్ టూ లర్న్ అనే కోర్సు ప్రారంభిస్తున్నామన్నారు. ప్రతి నెలలో తరగతుల నిర్వాహణతో పాటు కొన్ని రోజులు వారికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో వచ్చే ఆదాయంతో వారు చదువు కోసం ఖర్చు చేసుకోవచ్చన్నారు. ఇంటర్ పూర్తి చేసి హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేయాలనుకున్న వారు వచ్చేనెల 3వ తేదీన అల్వాల్‌లోని డాక్టర్ నారాయణ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కుషాయిగూడ: మహిళలు ఎదుర్కొనే రుగ్మతలకు సంబంధించి ప్రతి మంగళవారం ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. చర్లపల్లిలోని బస్తీ దవాఖానాలో నిర్వహించిన మహిళ ఆరోగ్య క్లినిక్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చిన మహిళలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్య రక్షణకు శ్రీకారం చుట్టిందన్నారు.


క్లినిక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్


మేడిపల్లిలో వినాయకుడి పూజల్లో పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ హరిశంకర్‌రెడ్డి తదితరులు


మేడిపల్లిలోని అనురాధ అపార్ట్‌మెంట్ సీ-బ్లాక్‌లో అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, శ్రీకాంత్, హేమంత్, వలస విజయ్‌కుమార్, ప్రద్యుమ్న, పవన్ తదితరులు


గౌతంనగర్‌లో అన్నదానం చేస్తున్న శ్రీసాయి క్యాటరింగ్ ప్రతినిధులు


యాదవనగర్ యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో..


నిమజ్జనం ఘాట్ వద్ద శివపుత్ర ఫ్రెండ్స్ అసోషియేషన్ వినాయకుడు


కుషాయిగూడలో నిమజ్జనానికి తరలివచ్చిన గణనాథుడితో భక్తులు..


ఓల్డ్ మల్లాపూర్ స్వస్తిక్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో పూజలు


బోడుప్పల్ శ్రీవినాయక నగర్ కాలనీలో త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో పూజల్లో కార్పొరేటర్ పద్మారెడ్డి

క్లుప్తంగా...

మల్కాజిగిరి ఏసీపీగా ఆకుల శ్రీనివాస్



ఉప్పల్: మల్కాజిగిరి ఏసీపీగా ఆకుల శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. హెచ్ఆర్‌సీ డిపార్టుమెంట్ డీఎస్పీగా పనిచేసిన ఆయన మల్కాజిగిరి ఏసీపీగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏసీపీగా పనిచేసిన నరేష్‌రెడ్డి హెచ్ఆర్‌సీ డిపార్టుమెంట్ డీఎస్పీగా బదిలీపై వెళ్లారు.

మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్



మల్కాజిగిరి: మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పి.ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సీఐ బి.రవికుమార్ రాచకొండ ఎస్‌బీ విభాగానికి బదిలీ కాగా ఆయన స్థానంలో ప్రవీణ్‌కుమార్ బదిలీపై వచ్చారు. ఏడు నెలల క్రితమే మల్కాజిగిరికి వచ్చిన రవికుమార్ బదిలీ కావడం చర్చనీయాంశమైంది.

బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వేముల మారయ్య



మల్లాపూర్: భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్(బీఆర్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాచారం ప్రాంతానికి చెందిన వేముల మారయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా వేముల మారయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌టీయూ బలోపేతానికి, ట్రేడ్ యూనియన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, కనీస వేతనాల మండలి చైర్మన్ నారాయణతో కలిసి వెళ్లి ఎమ్మెల్సీ కవితను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ఉప్పల్: అండర్ గ్రౌండ్ కేబుల్ మరమ్మతుల కారణంగా ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కిరణ్ తెలిపారు. రహదారితో పాటు 11 కేవీ సత్యనగర్ ఫీడర్ పరిధిలోని వేంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. ఎస్ఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం మల్లాపూర్ ఛండీయానగర్‌లో మంగళవారం ఓ ఇంటిపై గుర్తుతెలియని వ్యక్తి సుమారు(40) ఏళ్ల వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుడి చేయిపై అంజయ్య, చంద్రశేఖర్ అని పచ్చ బొట్టుతో పేర్లు ఉన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిస్తే నాచారం పోలీస్‌స్టేషన్ ఫోన్: 87126 62147, 87126 62149.

జీ ప్యాట్ మార్గదర్శన్‌తో విద్యార్థులకు మేలు


జీ ప్యాట్ మార్గదర్శన్‌ను ఆవిష్కరిస్తున్న సంజీవ్‌రెడ్డి

బోడుప్పల్: ఫార్మసీ రంగంలో వినూత్న ప్రయోజనాలు పెంపొందించడానికి జీ ప్యాట్ మార్గదర్శన్ ఎంతో దోహదపడుతుందని బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్‌లో మంగళవారం డాక్టర్ మునిజా ఫార్మసీ విద్యార్థులకు పోటీ పరీక్షల్లో సులువుగా అర్థం చేసుకునే విధంగా రూపొందించిన జీ ప్యాట్ మార్గదర్శన్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా జీ ప్యాట్ మార్గదర్శన్‌ను రూపొందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొత్త చక్రపాణిగౌడ్, కాటపల్లి రాంచంద్రారెడ్డి, రాసాల మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆస్తిపన్ను బకాయిలు చెల్లించండి


ఆస్తిపన్ను వసూలు డీడీ అందుకుంటున్న డీసీ రాజు

మల్కాజిగిరి: వ్యాపార సముదాయాల యజమానులు ఆస్తి పన్ను బకాయిలు సకాలంలో చెల్లించాలని మల్కాజిగిరి సర్కిల్ డీసీ జి.రాజు కోరారు. డీసీ మాట్లాడుతూ మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని వ్యాపార సముదాయాల యజమానుల్లో కొంత మంది దీర్ఘకాలికంగా బకాయిలు ఉన్నారని, అటువంటి వారిని గుర్తించామన్నారు. త్వరితగతిన బకాయిలు చెల్లించకపోతే నోటీసులు, వారెంట్లు జారీ చేసిన ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక కార్యక్రమం ద్వారా మంగళవారం సుమారు రూ. 17,05,383 వసూలు చేశామని తెలిపారు. వీవో దయానంద, టీఐ సత్తిబాబు, బిల్ కలెక్టర్ హరీష్ పాల్గొన్నారు.

వివాన్‌కి అరుదైన పురస్కారం


ప్రశంసాపత్రం, మెడల్‌తో వివాన్

అల్వాల్: అతి చిన్న వయసులో అరుదైన రికార్డు సృష్టించి నోబుల్ వరల్డ్ రికార్డ్ బుక్స్‌లో స్థానం సంపాదించాడు కలివే వివాన్. అల్వాల్, జొన్నబండ, బృందావన్ కాలనీలో నివాసముండే పురుషోత్తం, అనుప్రియాంక దంపతుల కుమారుడు వివాన్ వయస్సు ఒక సంవత్సరం. ప్రపంచంలో అతి తక్కువ సమయంలో స్టాక్ ద రింగ్స్ ఇన్ పోల్(రింగులను సైజు ప్రకారం పద్ధతిలో పేర్చడం) ప్రక్రియలో 72 సెంకండ్లలో పూర్తిచేసి రికార్డు సృష్టించి మెడల్, ప్రశంస ప్రతం అందుకున్నాడు. తల్లిదండ్రులు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా విధులు నిర్వహిస్తుండగా తాత రామకోటేశ్వరరావు మాజీ రైల్వే ఉద్యోగి, మెజీషియన్, మిమిక్రీ కళాకారుడు.

కాంగ్రెస్ సీటు స్థానికులకే కేటాయించాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత బోనగిరి సురేష్ యాదవ్

గౌతంనగర్: అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ నుంచి మల్కాజిగిరి అసెంబ్లీ సీటును స్థానికులకే కేటాయించాలని ఏఐసీసీ ఓబీసీ నేషనల్ కో ఆర్డినేటర్ బోనగిరి సురేష్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మల్కాజిగిరిలోని ఆయన నివాసంలో పార్టీ శ్రేణులతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సురేష్ యాదవ్ మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోట అన్నారు. తాను ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ సేవలందించానన్నారు. 1983లో ప్రధాన మంత్రి హోదాలో ఇందిరాగాంధీ మల్కాజిగిరికి రావడానికి తాము కృషి చేశామన్నారు. దశాబ్ద కాలంగా కాంగ్రెస్ బలోపేతానికి కష్టపడిన తనకు మల్కాజిగిరి అసెంబ్లీ సీటు కేటాయించాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని ఆయన కోరారు.

కల్తీ అల్లం వెల్లుల్లి తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

ఉప్పల్: కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న వ్యక్తిని మల్కాజిగిరి ఎస్‌వోటీ, ఉప్పల్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఓల్డ్ రామంతాపూర్‌లో కొంత కాలంగా రసాయనాలు వాడుతూ కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తూ అందంగా ప్యాక్ చేసి హోటళ్లు, షాపులకు సరఫరా చేస్తున్నారనే సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు మంగళవారం ఆ స్థావరంపై దాడి చేశారు. పాత రామంతాపూర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అబ్దుల్(25)ను అదుపులోకి తీసుకున్నారు. భారీగా అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

గవర్నర్ కోటాలో అవకాశం కల్పించాలి

కుషాయిగూడ: కాపు సామాజిక వర్గానికి చెందిన న్యాయవాది, సామాజిక కార్యకర్త వెన్నెల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర నరేష్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కాపు సంఘం నాయకులు ఆకుల వెంకటరమణమూర్తి, పి.కిరణ్, బి.ప్రవీణ్‌కుమార్, జి.వెంకట సీతారామయ్య, డాక్టర్ బి.శ్రీనాథ్ కోరారు. ఈ మేరకు గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ అపాయింట్‌మెంట్ కోరుతూ గవర్నర్ కార్యాలయానికి లేఖ పంపినట్లు వారు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 60 లక్షల మంది జనాభా ఉన్న కాపు సామాజిక వర్గానికి ఒక్కరు కూడా చట్టసభల్లో లేరన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని న్యాయవాది సుంకర నరేష్‌కు శాసనమండలి సభ్యుడిగా అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.